సమావేశానికి హాజరయ్యే ముందు రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ రమణ

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

బీఆర్ఎస్ సమావేశంలో మనోళ్లు

జగిత్యాల, ఫిబ్రవరి 19: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు హాజరయ్యారు.

ఎమ్మెల్సీ కవితతో మాట్లాడుతున్న రాజేశం గౌడ్

ఎమ్మెల్సీని కలిసిన మాజీ మంత్రి

జగిత్యాల, ఫిబ్రవరి 19: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ బుధవారం బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితను మాజీ మంత్రి రాజేశం గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సందీప్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, సోషల్ మీడియాలో వచ్చే మోసపూరిత కాల్స్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే డయల్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బాలికల పట్ల ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తిరుపతి, పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

కాలువ ఇలా.. సాగు నీరు అందేదెలా ?

కాలువలో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

వెల్గటూర్ మండలం చెగ్యాం, ముత్తునూర్, ముక్కట్రావుపేట గ్రామాలకు సాగు నీరందించే ఎస్సారెస్పీ డీ-83/బీ ప్రధాన కాలువ కప్పరావుపేట శివారులోని పెద్ద గుట్ట ప్రాంతంలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అధ్వానంగా మారింది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. ఎస్సారెస్పీ అధికారులు స్పందించి కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించి సాగు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. -వెల్గటూర్, ఫిబ్రవరి 19

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

- కలెక్టర్ సత్యప్రసాద్
- ఇసుక డంపులు స్వాధీనం

ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 19: ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. ధర్మపురి మండలంలంఆరెపల్లి, దమ్మన్నపేట గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను బుధవారం ఆయన ఎస్పీ అశోక్‌కుమార్, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాను నివారించడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి సమాచారం ఉంటే పోలీసులకు తెలుపాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసే వారిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎస్ఐ ఉదయ్‌కుమార్, మైనింగ్ అధికారులు ఉన్నారు.

భార్య, పిల్లల మృతికి కారణమైన వ్యక్తి రిమాండ్

పెగడపల్లి, ఫిబ్రవరి 19: భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన తిరుపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన కుంబాల తిరుపతి మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తన భార్య కుంబాల హారికను వేధింపులకు గురిచేశాడు. అతడి వేధింపులు తాళలేక ఈనెల 13న హారిక పురుగుల మందు తాగి, ఇద్దరు పిల్లలకు కూడా తాగించింది. దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ రెండు రోజుల వ్యవధితో తల్లి, ఇద్దరు పిల్లలూ మృతి చెందారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మృతికి కారణమైన తిరుపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జేఎన్టీయూని సందర్శించిన విద్యార్థులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: మండలంలోని నాచుపల్లిలో గల జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను బుధవారం జగిత్యాలలోని జ్యోతి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు సందర్శించారు. కళాశాలలో పరిశోధన కేంద్రాలు, ల్యాబ్‌లను తిలకించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చరణ్, శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

నూతన కార్యవర్గానికి సత్కారం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 19: మెట్‌పల్లి పట్టణ గీత కార్మిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, డైరెక్టర్లు ఎనగందుల శ్రీనివాస్‌గౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, గుండవేని ప్రణయ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, బక్కూరి రమేశ్‌ను శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి రామాగౌడ్, చెట్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్, నాయిని శ్రీనివాస్‌గౌడ్, ఏపూరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు

సొసైటీ ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: మండలంలోని పూడూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం 340 బస్తాల యూరియా రాగా రైతులు బారులు తీరారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో గంటల తరబడి నిల్చొని తీసుకెళ్లారు. దొరకని రైతులు కొడిమ్యాల, గంగాధర, తదితర ప్రాంతాలకు వెళ్లారు. ఈ విషయమై సీఈవో రాజేందర్‌ను వివరణ కోరగా వారానికొక లోడ్ మాత్రమే పంపిస్తున్నట్లు చెప్పారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
LOST
★ Rangu Mysaiah S/o. Rangu Chennaiah, H.No. 1-5/4, Cheerlavancha, Vemulawada mandal, Rajanna Sircilla Dist. My Passport No. V6985187 Lost by travelling If any body found please Cell. 6300566234.
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వన భోజనాలు

సారంగాపూర్, ఫిబ్రవరి 19: బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో బుధవారం భక్తులు వన భోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సామ్రాట్ గౌడ్, అర్చకులు పెద్ద సంతోష్‌కుమార్, మధుకుమార్, చిన్న సంతోష్‌కుమార్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారిణి ప్రతిభ

సాధించిన పతకాన్ని చూపుతున్న వర్ష

రాయికల్, ఫిబ్రవరి 19: హైదరాబాద్‌లో ఈనెల 18, 19వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కట్కాపూర్ గ్రామానికి చెందిన మాదం వర్ష ప్రతిభ చూపింది. అండర్-16 లాంగ్ జంప్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా వర్షను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సభ్యులు ముత్యంరెడ్డి, శ్రీలత, మహేశ్ అభినందించారు.

ఆధార్ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 19 : 18 ఏండ్లు నిండిన వారి ఆధార్ నమోదుకు సంబంధించి తహసీల్దార్ల లాగిన్లలో ఉన్న పెండింగ్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లా స్థాయి ఆధార్ నమోదు కమిటీ సమావేశం బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ - కప్పారావుపేట్ (వెల్గటూరు) శాఖ - 368, జగిత్యాల
(ఒక భారత ప్రభుత్వరంగ సంస్థ) వెబ్‌సైట్: tgbhyd.in ఇ-మెయిల్: rmjgl@tgbhyd.in Cell: 9963950330, 8332988510
లీజు పై వసతి కావలెను
బ్యాంకుకు తమ కప్పారావు పేట్ (వెల్గటూరు) శాఖ (వెల్గటూరు మండలం, జగిత్యాల జిల్లా) నిమిత్తం అద్దె ప్రాతిపదికన సుమారు 1800 చ.అ.ల నుంచి 2000 చ.అ.ల వసతి దీర్ఘకాలిక లీజుపై కావలెను. ఆఫర్లు రెండు బిడ్లు, ప్రాతిపదికన అనగా టెక్నికల్ బిడ్ మరియు ప్రైస్ బిడ్‌లుగా , ఈ రెండింటిని ఒకే కవరులో యుంచి, బ్రాంచి మేనేజర్ , తెలంగాణ గ్రామీణ బ్యాంకు కప్పారావుపేట్ (వెల్గటూరు) శాఖ , జగిత్యాల, ఇ.నెం. 2-148, అంబేద్కర్ చౌరస్తా, వెల్గటూరు, జగిత్యాల-505 526కు సమర్పించవలెను. సమర్పించుటకు గల ఆఖరి తేది: 27-02-2025 వివరాలకై బ్యాంకు వెబ్ సైట్ www.tgbhyd.in చూడండి.
తేది: 19/02/2025
సం/- బ్రాంచ్ మేనేజర్
కప్పారావుపేట్ (వెల్గటూరు శాఖ) జగిత్యాల

వెంకటేశ్‌నేతను విమర్శించే హక్కు వివేక్‌కు లేదు

ధర్మపురి, ఫిబ్రవరి 19: పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్ నేతను విమర్శించే హక్కు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి లేదని నేతకాని సంఘం నాయకులు మండిపడ్డారు. ధర్మపురిలో బుధవారం నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్‌నేత విలేకరులతో మాట్లాడారు. ఎస్సీల్లో మూడో స్థానంలో ఉన్న నేతకాని సామాజిక వర్గానికి ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నేతకాని కులస్తుల హక్కుల కోసం పోరాడుతున్న వెంకటేశ్‌నేతపై విమర్శలు మానుకోవాలని వివేక్‌కు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిప్పల్ల గంగాధర్, మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, ధర్మారం, ఎండపెల్లి, వెల్గటూర్ మండలాధ్యక్షులు మల్లేశ్, కేశవయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డుల ఉద్యమం

- సీఎంకు ఉత్తరాలు రాసిన తెలంగాణ ఉద్యమకారులు

సీఎంకు పోస్టు కార్డులు పంపిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 19: ఎన్నిక సమయంలో తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులు బుధవారం పోస్టుకార్డులపై సీఎం రేవంత్‌రెడ్డికి రాసి పంపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం చైర్మన్ జవ్వాజి శంకర్, వైస్ చైర్మెన్ రాగుల రాజు, ప్రధాన కార్యదర్శి భారతపు లింగారెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కొండ ప్రేమ్‌కుమార్, మల్యాల సతీశ్, ఉపేందర్, రాకేశ్, పరకాల వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: మండలంలోని చెప్యాల గ్రామంలో ఆర్బీఐ సహకారంతో విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు కొడిమ్యాల సీఎఫ్ఎల్ సెంటర్ సభ్యులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సీఎఫ్ఎల్ కౌన్సెలర్ శంకర్ మాట్లాడుతూ, మహిళలకు బ్యాంక్ ఖాతా రకాలు, పొదుపు, బీమా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సెలర్లు కృష్ణవేణి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: నల్లగొండ శివారులో జగిత్యాల-వేములవాడ ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాలకు చెందిన కాసారపు ప్రణయ్, అవుదుర్తి దినేశ్ ద్విచక్ర వాహనంపై కొడిమ్యాలకు వస్తున్నారు. నల్లగొండ శివారులోని మూలమలుపు వద్ద కారు ఢీకొట్టడంతో ప్రణయ్, దినేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు జగిత్యాల దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీవో విచారణ

ఇంటి ముందు కొలతలు తీస్తున్న ఎంపీవో, సిబ్బంది

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: మండల కేంద్రానికి చెందిన రాగి రఘునందన్ సెట్ బ్యాక్ వదలకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఎంపీవో ప్రవీణ్ విచారణ చేపట్టారు. ఇంటి పరిసరాల్లో కొలతలు తీశారు. ఇంటి అనుమతి కోసం గ్రామ పంచాయతీలో సమర్పించిన పత్రాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు. గ్రామ పంచాయతీ ఈవో వంశీవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డు సృష్టించిన రేకుర్తి కంటి దవాఖాన

విద్యానగర్, ఫిబ్రవరి 19 : రేకుర్తిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ భాస్కర్ మడేకర్ నేత్ర వైద్యశాలలో బుధవారం ఒక్కరోజే 109 ఆపరేషన్లు నిర్వహించి రికార్డు సృష్టించారు. హాస్పిటల్‌లో వారంలో రెండు రోజులు ఉచితంగా, ఒకరోజు వాకిన్ ఫ్రీ, ఒక రోజు రెఫరల్ పేషెంట్లకు, వారంలో నాలుగు రోజులు ఉచితంగా పేదలకు కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. డబ్బులు పెట్టి కంటి ఆపరేషన్ చేసుకునే వారికి అత్యాధునికమైన పరికరాలతో చాలా తక్కువ ఖర్చుతో కంటి ఆపరేషన్లు చేస్తున్నామని చైర్మన్ కొండా వేణుమూర్తి తెలిపారు.

కోరుట్ల పాఠశాల విద్యార్థులకు అరుదైన గౌరవం

- కబడ్డీ పోటీలకు దక్కిన ప్రశంసలు
- విద్యార్థులకు బహుమతులు పంపిన క్రీడా మంత్రిత్వ శాఖ

కేంద్ర విద్యాశాఖ పంపిన బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోరుట్ల, ఫిబ్రవరి 19: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అరుదైన గౌరవం దక్కింది. న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్‌లోని విద్యా మంత్రిత్వ శాఖ, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సంయుక్త ఆధ్వర్యంలో దేశంలోని పాఠశాలల విద్యార్థులకు 'గొప్ప భారతీయ వారసత్వం' అంశంపై థీమ్ ఆధారిత పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో కోరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 6, 7వ తరగతి విద్యార్థినులు భారత దేశ ప్రాచీన క్రీడ కబడ్డీని ఎంచుకున్నారు. తాము ఆడిన కబడ్డీ పోటీల వీడియో డాక్యుమెంట్‌ను భారతీయ కేల్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. విద్యార్థినులు అప్‌లోడ్ చేసిన కబడ్డీ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా అత్యధిక ప్రశంసలు దక్కించుకుంది. కాగా, కబడ్డీ ఆడిన 14 మంది విద్యార్థినులకు విద్యా మంత్రిత్వ శాఖ బుధవారం పోస్ట్ ద్వారా క్రీడా పరికరాలను బహుమతిగా పంపించింది. డాక్యుమెంట్ రూపకల్పనకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు అభినందనలు తెలిపారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

గొల్లపల్లి: శ్రీరాములపల్లిలో శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

జగిత్యాల రూరల్/సారంగాపూర్/మల్లాపూర్/మేడిపల్లి/మెట్‌పల్లిరూరల్/ కోరుట్ల/కోరుట్లరూరల్/కొడిమ్యాల/గొల్లపల్లి, ఫిబ్రవరి 19: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, శివాజీ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పతకాలు ప్రదానం

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: సిరిసిల్లలో ఈనెల 16న స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని సండ్రల్లపల్లి కస్తూర్బా విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. కాగా, బుధవారం విద్యార్థులకు ఎస్ఐ చేతుల మీదుగా పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి లావణ్య, కరాటే మాస్టర్ లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

చిట్టాపూర్‌లో మెకానిక్ దుకాణం దగ్ధం

మల్లాపూర్, ఫిబ్రవరి 19: మండలంలోని చిట్టాపూర్‌లో గ్రామానికి చెందిన చింతకింది లక్ష్మణ్ అనే వ్యక్తికి చెందిన మెకానిక్ దుకాణం బుధవారం వేకువజామున అగ్నిప్రమాదంలో కాలిపోయింది. దీంతో దుకాణం ఆవరణలో ఉన్న రెండు ద్విచక్ర వాహనాలతో పాటు పది సైకిళ్లు కాలిపోయాయి. సుమారు రూ.1.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు తైక్వాండో బెల్టుల ప్రదానం

తైక్వాండో బెల్టులు అందుకున్న విద్యార్థులతో కోచ్

కోరుట్ల, ఫిబ్రవరి 19: పట్టణంలోని నవ జ్యోతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు బుధవారం కోరుట్ల తైక్వాండ్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు కలర్ బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ సంతోష్ కుమార్, క్లబ్ వ్యవస్థాపకుడు నావనంది రమేశ్, మాస్టర్ రాహుల్, కరస్పాండెంట్ సుజాత సుకుమారన్, పీఈటీ పూజ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలపై రవాణా శాఖ కొరడా

తిమ్మాపూర్, ఫిబ్రవరి 19: సరైన పత్రాలు లేకుండా రోడ్డుపై తిరుగుతున్న 25 వాహనాలపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. వాహనాల ఫిట్నెస్, ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవర్లకు లైసెన్స్‌లు లేకుండా రోడ్డుపై తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను రవాణా శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి సీజ్ చేసి తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయానికి తరలించారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కు సత్కారం

కోరుట్ల, ఫిబ్రవరి 19: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సత్కరించారు. చైర్మన్‌గా ఎన్నికై మొదటి సారి కోరుట్లకు వచ్చిన రియాజ్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొంతం రాజం, నయీమ్, ఏలేటి మహిపాల్ రెడ్డి, ఎంబేరి నాగభూషణం, సోగ్రాబీ, రమేశ్, గంగాధర్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల, ఫిబ్రవరి 19: పట్టణంలోని మాదాపూర్ కాలనీలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్యామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్లమ్మ ఆలయానికి విరాళం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 19: మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ నిమిషకవి నవీన్ భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయానికి రూ.50 వేలు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోసానిపేటలో శివాజీ విగ్రహావిష్కరణ

కథలాపూర్, ఫిబ్రవరి 19: కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామంలో శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు పాల్గొన్నారు. అలాగే, కథలాపూర్‌లో శివాజీ విగ్రహ ఏర్పాటు పనులకు స్థానిక నాయకులు భూమిపూజ చేశారు.

ఆర్థిక సాయం

గొల్లపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని మల్లన్నపేట గ్రామానికి చెందిన బుర్ర వెంకన్న-వజ్రవ్వ దంపతుల కూతురు రాజమణి వివాహం నిశ్చయమైంది. కాగా, గ్రామానికి చెందిన యువ నాయకుడు అవారి చందు బుధవారం రూ. 5 వేల నగదు అందజేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడ్డ మహిళలు

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

ధర్మపురి రూరల్, ఫిబ్రవరి 19: ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి చొరబడ్డ ఐదుగురు మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఐదుగురు మహిళలు బుధవారం మధ్యాహ్నం పాత సామగ్రి సేకరించడానికి తిమ్మాపూర్ గ్రామంలోకి వచ్చారు. అయితే, గ్రామంలోని పెరుకవాడకు చెందిన బొండ్ల భీమయ్య తాను ఉంటున్న ఇంటికి తాళం వేసి, సమీపంలో మరో ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండగా అక్కడికి వెళ్లాడు. కాగా, గమనించిన ఐదుగురు మహిళలు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న స్టీల్ సామగ్రి సర్దుకున్నారు. ఈ క్రమంలో ఇంట్లో శబ్దం రావడంతో ఇరుగుపొరుగు భీమయ్యకు సమాచారం అందించారు. ఆయన వచ్చి ఇంట్లోకి వెళ్లగానే సదరు మహిళలు పారిపోయేందుకు యత్నించారు. స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సదరు మహిళలు చొప్పదండికి చెందిన వారుగా గుర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 19 : ఇంటర్, పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఇంటర్ పరీక్షల పర్యవేక్షణ ఉంటుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరికీ సెల్ ఫోన్ అనుమతి లేదని తెలిపారు. ప్రశ్న పత్రాలను కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతరులు ఎవరూ కూడా పరీక్షా కేంద్రాల్లో ఉండరాదని, గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ కేంద్రాల్లోకి అనుమతించరాదని ఆదేశించారు. పరీక్షలు జరిగే తేదీల్లో ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష వేళల్లో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, భయం లాంటి మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తే బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నియమించిన మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని, దీని కోసం టోల్ ఫ్రీ నంబర్ 14416 లేదా 1800 914416లో సంప్రదించాలని చెప్పారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని స్పష్టం చేశారు. జిల్లా ఇంటర్‌విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, మార్చి 5 నుంచి 22 వరకు ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. ప్రథమ సంవత్సరం 17,799 మంది, ద్వితీయ సంవత్సరం 17,763 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. మొత్తం 58 సెంటర్లు ఏర్పాటు చేశామని కరీంనగర్‌లో 37 సెంటర్లు ఉన్నాయని వెల్లడించారు.